భక్తి శతకం

డా.బులుసు వేంకటసత్యనారాయణమూర్తి

కళాగౌతమి

7-29-7,టి.నగర్,రాజమండ్రి-1

భక్తి శతకం

డా. బి. వి. యస్. మూర్తి

తొలి కూర్పు : జూన్, 2009

ప్రతులు : 1000

వెల : 15

దొరకు చోటు : కళాగౌతమి

6-13-15, టి.నగర్,

రాజమండ్రి - 1

ఫోన్: 0883 2441829

సెల్ : 9866290025

వందనం

మాతృదేవత శేషమ్మ మహిత సుగుణ
ఘన పతివ్రత, ఆచార కలిత, మమ్ము
పేర్మి పెంచిన సౌజన్య, కూర్మి నామె
పాదపద్మముల్ స్మరియింతు పరమ భక్తి

'కౌశిక' స్నాన మొనరించి కడు శుచియయి
దేవ పితృ ఋషి ఋణములు దీర్చి, లేదు-
అనక తన పంక్తి నతిథుల నాదరించి
మహిని ఖ్యాతిని గొన్నట్టి మాదు తండ్రి
బులుసు వేంకటరమణయ్య బుధుని కొలుతు

జననీ జనకుల ఋణ మీ
యనువున లవ మాత్రమైన నది తీర్పంగన్
మనసున కోర్కె జనింపగ
నొనరించితి శతక మొండు నూటెనిమిదితో

చదివితి నితిహాసమ్ముల
చదివితి శ్రద్ధను ప్రబంధ సంపదనెల్లన్
చదివిన చదువుకు సార్థక
మొదవగ రచియించినాడ నొప్పు రసజ్ఞుల్

నా దనున దేది యున్నను
నాదా యది? పూర్వ కవి ధనమ్మే కాదా?
ఏదో కూర్చితి నంతియె
నాదని నే చెప్పబోను నమ్ముడు సుజనుల్

ఆప్తవాక్యం

మేధలో భారతీయ సంస్కృతిని నిల్పి
ఆంధ్ర కర్ణాట సారస్వతాబ్ధి తరచి
విలువగల జాతిరత్నముల్ వెలువరించి
విశ్వవిద్యాలయాలచే వినుతిగన్న
ఆంధ్రమేధావి పుంగవుం డల ప్రపంచ
తెలుగు సభలలో ఘనమైన తెలుగు జగతి
తెలుగు వసుధ బృహత్సంచికలలో భవ్య
వ్యాసముల్ వ్రాసి విశ్వవిఖ్యాతి రాణ్మ
హేంద్ర పురమునకెల్ల కల్పించినట్టి
మాననీయుడు బులుసు వంశ ప్రదీప్త
రత్నము నిగర్వి సుగుణ విరాజితుండు
సమత గీలించి గ్రంథరాజములు పెక్కు
వరుస లిఖియించె ఛందస్సుపై విశిష్ట
భాష పైన అలంకార ఫణితి పైన
లలిత పరిశోధిత వ్యాసములు రచించె
ఉత్తమాధ్యాపకుడుగ నుదాత్తు డౌచు
రీడరై తాను పదవిలో ప్రోడయయ్యె
అహా! బి వి యస్సు మూర్తి వదాన్య ప్రజ్ఞ
ఎంత వర్ణింతు వీరి నత్యంత కరుణ
అమ్మ లలితాంబ బ్రోచు నహర్నిశమ్ము.

ఇట్లు
సిద్ధ సుకవి
మాడా సుబ్బరాయ కవి

భక్తి శతకం

ఆలింపుము విన్నపమిదె
వేలుపు రక్షకుడ నిన్ను వేడుకొనియెదన్
నాలోని చింత మానిచి
నీలోనికి చేర్చుకొమ్ము నేలుగ మూర్తీ! 1

సుర,గరుడ,యక్ష,కిన్నర
నిరుపమ జేగీయమాన నిఖిలాశా సం
భరిత యశో మహనీయ
స్ఫురణుడు హరి తా పురాణపురుషుడు మూర్తీ! 2

ఏ కథలయందు పుణ్య
శ్లోకుడు హరి చెప్పబడును సూరి జనముచే
నా కథలు పుణ్య కథలని
యాకర్ణింపంగవలయు నార్తిని మూర్తీ! 3

చెవులార విని తరించగ
యవితథమగు హరి గుణంబు లలసటలేకన్
వివరింతు వరుస తోడను
భువి నా హరి కీర్తనమ్ము పుణ్యము మూర్తీ! 4

గజరాజ వరదు గుణములు
త్రిజగత్పావనము లగుట తేట పడంగా
సుజన మనోరంజకముగ
ప్రజలందరి నోట పలుక పలికెద మూర్తీ! 5

మీ కిప్పుడు వివరించెద
నాకర్ణింపుడు సరోరుహాక్షుండగు సు
శ్లోకుని చరితామృత పరి
షేకులరై ముదముగదుర చెలగుచు మూర్తీ! 6

తిరుగుచు, కుడుచుచు, త్రాగుచు
నరుగుచు, కూర్చుండిలేచు చనవరతంబున్
హరి దలచి దలచి జగ మా
హరిమయమని తెలియ మోక్ష మదియే మూర్తీ! 7

మనమున హరి సేవింపని
దినములు వ్యర్థమ్ములగుచు తిరుగుచు నుండున్
తనువులు నిలుకడ యగునా?
ధనములు, భవనములు గలుగ ధరలో మూర్తీ! 8

తరియించును సంసారము
హరియించును పాతకముల, నాగమముల కా
భరణంబగు, నార్తజనుల
శరణంబగు విష్ణు దివ్యచరణము మూర్తీ! 9

మానుగ హరి నామ జపము
నానా భవరోగ కర్మనాశమునకు వి
న్నాణంబగు నౌషధమని
కానరు దుష్టాత్ము లకట ఖలులై మూర్తీ! 10

అతి పాప కర్ములైనను
సతతము హరినే దలంచి, చక్కగ హృదిలో
వితతంబుగ నెనరుంచిన
బ్రతుకగుగద సార్ధకమ్ము వసుధను మూర్తీ! 11

జగదేకారాధ్యు కథలు
మిగుల ప్రశస్తంబులనుచు మీఱిన భక్తిన్
పగలును రాత్రియు విడువక
తగిలి స్మరియించువారు ధన్యులు మూర్తీ! 12

ఎఱిగిన వారల మనుచును
కొఱమాలిన ఎఱుక గలిగి కొందరు హరి పే
ర్మెఱిగియు తలపగ నొల్లరు
పఱతు రధోగతులజాడ పశుతను మూర్తీ! 13

పరమ బ్రహ్మ మనంగా
పరతత్త్వ మనంగ, పరమపద మనగను, నా
హరియన, కృష్ణుడన జగ
ద్భరితుడు నారాయణుండు తానగు మూర్తీ! 14

హరి భక్తులతోడ మెలగి,
హరి గాథలు వినుటయన్న యానందముతో
సురియగ బాష్పకణమ్ములు
హరి భక్తుండగును, ధన్యు డతడే మూర్తీ! 15

తారల నెన్నగ వచ్చును,
భూరజముల లెక్కబెట్ట బోలును వరుసన్
నారాయణ గుణకథనము
లారయ వర్ణింప దలప నలవియె మూర్తీ! 16

గజగమనల పొందు నెపుడు
నిజమని నమ్మంగరాదు, నిత్యమును హరిన్
గజిబిజిలేక తలంచిన
సుజనులకును హరిపదమ్ము సులభము మూర్తీ! 17

ధర్మము, సత్యము, కీర్తియు
నిర్మల దయ, విష్ణుభక్తి, నిరుపమ ఘన స
త్కర్మ, మహింసా వ్రతమును
నర్మిలి గలవారె పుణ్యులగుదురు మూర్తీ! 18

జ్ఞానముచే, మౌనముచే
దానముచే, యోగ సంవిధానముచేతం
బూని నిబద్ధుం డగునే?
శ్రీనాథుడు భక్తిచేతె చిక్కును మూర్తీ! 19

హరి కథలు, హరి చరిత్రము
హరి లీలావర్తనముల నంచిత రీతిన్
పరువడి నెరుగంగవలయు
వరమతి నభిమానమెల్ల వదలుచు మూర్తీ! 20

భవములకు మందు, చిత్త
శ్రవణానందము, ముముక్షుజన పదము హరి
స్తవము పశుఘ్నుడు తక్కను
చెవులకు తనివయ్యె ననడు చెనటియు మూర్తీ! 21

ప్రియురాలి వలని వార్తలు
ప్రియజనులకు నెల్లప్రొద్దు ప్రియమగు రీతిన్
ప్రియుడగు హరి చరితంబులు
ప్రియభక్తుల కెల్లప్రొద్దు ప్రియములె మూర్తీ! 22

దేహము కారాగృహమగు
మోహము సంకెలలు, రాగముఖరములు రిపు
వ్యూహములగు భక్తి హరిని
యూహింపని యంత తడవు నుర్విని మూర్తీ! 23

శ్రీపతి పదమను నావను
ప్రాపించి భవాబ్ధి వత్సపదముగ భక్తుల్
రూపించి దాటి చేరుదు
రాపత్పద రహితులగుచు నా హరి మూర్తీ! 24

పగవారి నడత యందున
పగ యించుక లేక సమత పరగెడు హరికిన్
పగ గలదె? ఖలుల నణచగ
జగదవనము కొరకుగాదె జగడము మూర్తీ! 25

హరియని సంభావింపగ
హరియని దర్శింప, నామ మాశ్రయ మవగన్
హరియని రుచిగొన దలచగ
హరి హరి యనువాని పొగడ నలవియె మూర్తీ! 26

భక్తుల హృదయము హరిదగు
భక్తుల హృదయంబు హరియె, భావమునందున్
భక్తుల నెరుంగు నా హరి
భక్తు లెరుంగగలరు హరిపదమును మూర్తీ! 27

తాలిమి భక్తుల ధర్మము
తాలిమి మూలంబు ధర్మతత్త్వంబునకున్
తాలిమి గలిగిన, హరి ని
న్నేలించును బ్రహ్మపదము నిజమిది మూర్తీ! 28

హరి గొల్చుచుండు వారలు
హరిపదములె తక్క నన్యమైన పదంబుల్
నరక సమానములంచు ని
తర విషయాసక్తులకును తగులరు మూర్తీ! 29

వెడవింటివాని చిగురా
కడిదపు వేటునకు లొంగి యతి మోహితుడై
విడువక సతులం దగులుచు
చెడు బుద్ధిని హరిని విడువ చేటగు మూర్తీ! 30

అదలదు ప్రాణము లదలిన
కదలదు సర్వాంగములును కదలుచు నున్నన్
వదలదు బిగువులు సడలిన
తుదిలేనిది తృష్ణ, హరియె ద్రుంచును మూర్తీ! 31

క్షమ కలిగిన సిరి కలుగును
క్షమ కలిగిన విద్య కలుగు, సౌఖ్యము లెల్లన్
క్షమ కలుగ తోన కలుగును
క్షమ కలిగిన హరియు మెచ్చు సదయత మూర్తీ!32

కడలే దాశాలతకును
కడ చూడగ వశముగాదు, కడ కనుదురు తా
కడు ముదమున సంసారము
కడ కని హరిభక్తవరులు గరిమను మూర్తీ! 33

ఎప్పుడు నశించు ధర్మం
బెప్పుడు పాపంబు పెరుగు నీ లోకములో
నప్పుడు విశ్వేశుడు హరి
తప్పక జనియించు తాను ధరణిని మూర్తీ! 34

ఒకపరి జగముల వెలినిడి
నొకపరి లోపలికి గొనుచు, నుభయము తానై
సకలార్థ సాక్షియగు, న
య్యకలంకుని మరువదగదు నాత్మను మూర్తీ! 35

ఎరుగును హరి తా నెప్పుడు
మరువడు సకలంబు, తన్ను మరచిన యెడలన్
మరచునని యెపుడు తెలియుచు
మరువక మొర యిడగవలయు మనుజుడు మూర్తీ!36

మొదల జలమిడిన చెట్టుకు
తుది మొదలను చల్లదనము దొరకొను రీతిన్
మొదలుగ శ్రీహరి మ్రొక్కిన
ముదమొందరె వేల్పులెల్ల మురియుచు మూర్తీ! 37

హరియందే ప్రభవించును
హరియందు వసించియుండు నఖిల జగమ్ముల్
హరియందె లయము పొందును
హరి యుదరము సర్వభూత హారిణి మూర్తీ! 38

మొదలున హరియే తోచెను
తుదియును హరి తోచె, నడుమ తోచెను హరియే
తుది నడుమ మొదలు సృష్టికి
విదితము కుండకును మట్టి విధమున మూర్తీ! 39

కొందరు కలడందురు హరి
కొందరు లేడందురు, హరి గొడవేలంచున్
కొందరు, కలడని లేడని
కొందల మందుదురు హరిని కొలువగ మూర్తీ! 40

హరికంటె నొండెరుంగకు
హరికంటెను లేరు జగతి నాదుకొనంగన్
హరికంటె నొడయ డెవ్వడు?
హరియే లోకములకెల్ల నాద్యుడు మూర్తీ! 41

పూని హరిని సేవింపని
హీనులు పొందంగ జాల రిష్టార్థంబుల్
దానవు లమృతము ద్రావను
పూని పయోరాశి చిలికి పొందిరె మూర్తీ! 42

చేయకు దుష్కార్యంబులు
మూయకు సన్మార్గ ఫణితి మురియుచు, ఖలులన్
డాయకు, పుణ్యజనంబుల
బాయకు, హరిపదము నెపుడు వదలకు మూర్తీ! 43

పలుకులు మధురస ధారలు
తలపులు నానా ప్రకార దావానలముల్
చెలుములు భీకర వృకములు
చెలువల చేరకుము, హరిని చేరుము మూర్తీ! 44

నారాయణు, పరమేశ్వరు
నేరీతి తలంతు, మంత్ర మెయ్యది, విహితా
చారంబు లేప్రకారము,
లారాధన కాలమెద్ది యనవలె మూర్తీ! 45

ఇంగలమునందు వేసిన
బంగారము వన్నె పెరుగు భంగిని, హరి సే
వాంగీకృతుని యఘంబులు
భంగములై పొందు విష్ణుపదమును మూర్తీ! 46

పెరవాడు గురుడటంచును
కొరగాని పదంబు చేర కుజనుడెయగు నా
నెఱత్రోవ హరిని కొలచిన
నఱమర లేనట్టి పదము నందును మూర్తీ! 47

పరిభూత వ్యధనంబులు
నిరుపమ సంసార వార్ధి నిర్మథనంబుల్
హరి సుచరిత కథనంబులు
పరిరక్షిత భక్తకోటి ఫణితులు మూర్తీ! 48

ఎవ్వడు సృజించు ప్రాణుల
నెవ్వడు రక్షించు, ద్రుంచు నెవ్వ, డనంతుం
డెవ్వడు, విభు డెవ్వ, డతం
డవ్వానిని హరిని చేయు మర్చన మూర్తీ! 49

చాలదు దాన గుణమ్మున
చాలదు తపమున్న, నధిక శాంతత యున్నన్
చాలదు హరి మెప్పింపను
చాలదు వేరొకటి భక్తి సాటిగ మూర్తీ! 50

ఆడుదమా హరి క్రీడను
పాడుదమా సతము విష్ణుపదములు నోటన్
వీడుదమా యరి వర్గము
కూడుదమా విష్ణుభక్త కోటిని మూర్తీ! 51

పాలింపుము బుద్ధిని, యు
న్మూలింపుము కర్మబంధముల, హరి చేరన్
చాలింపుము సంసారము
కీలింపుము మదిని భక్తి కేళిని మూర్తీ! 52

ఎందు గలడంచు నూరక
సందేహము పడెదవు హరి సాన్నిధ్యముకై
ఎందైన వెదకి చూడగ
నందే కనిపించు, దొరకు నా హరి మూర్తీ! 53

హరికిం బట్టము గట్టుము
హరిసేవా నిపుణివగుము, హరి గతివి, సదా
హరి రతివి యగుచు సతతము
హరి పాదము విడువకుండు మర్ధిని మూర్తీ! 54

ఉపవాసంబులు, వ్రతములు
తపములు వేయేల? హరియె దైవంబని ని
ష్కపటత గొల్చిన వానికి
యపమృత్యు భయంబు లంటవందురు మూర్తీ! 55

లేదని యెవ్వరి నడుగకు
రాదని చింతింపకు, హరి రప్పించినచో
కాదని యేదియు మానకు
ఖేదము, మోదమును లేక కృపయని మూర్తీ! 56

నిందింపకు, పరుల నెపుడు
వందింపకు, మాపదొచ్చి పడినను మది నా
క్రందింపకు, సంపద కా
నందింపకు, విష్ణుపదము నందగ మూర్తీ! 57

వాదములు వేయి యేలను
వేదోక్తవిధిం జరించు విబుధుండైనన్
మోదముతో నారాయణ
పాదంబులు గొల్చు ముక్తిపదముకు మూర్తీ! 58

హరిభక్తిచేత భక్తులు
పరిమార్తురు పాపరాశిపాశముల న్ని
ష్ఠుర కిరణములను సూర్యుం
డరయగ పెనుమంచు నంత నణచడె మూర్తీ! 59

వేదము చెప్పున దేదియొ
మోదంబుగ ధర్మ మదియె, మూర్ఖత నన్యం
బేదియు చెప్ప నధర్మం
బాదిని హరిరూపు వేదమనుటను మూర్తీ! 60

అనుదినమును హరి చరితము
వినిరేని, పఠించిరేని విస్మయమొందన్
ఘనముగ లోకమ్మంతయు
మునుకొని వారలను గాంచి మ్రొక్కును మూర్తీ! 61

హరి దిక్కు కానివారికి
మరి దిక్కులు లేవు వెదుక మహిలో నెందున్
హరి దిక్కు తలచువారికి
కరివరదుడె దిక్కు నెల్లకాలము మూర్తీ! 62

హరి భక్తుండగు నాతం
డరయగ కైవల్యపదవి నందుట యరుదే!
ధర నేకులజుండైనను
హరి నామస్మరణ మోక్షమందును మూర్తీ! 63

బాలకులమంచు మిక్కిలి
మేలెరుగని వారమంచు మించిన దయతో
పాలించి యిచ్చు నా హరి
జాలితొ నిహపర సుఖములు సకలము మూర్తీ! 64

పరమపద మీ్మయ దలచి
కరుణించునుగాని హరిని కనుగొనుటకునై
యరసి నుతింపగ నేరికి
తరమా? భువి జన్మలెన్ని తరలిన మూర్తీ! 65

హరి చరణకమల మకరం
ద రసాస్వాదన మనఃప్రధానుడయిన న
పు్రరుషుం డొకచో విఘ్నం
బొరయ హరిస్మరణ మానబోవడు మూర్తీ!66

ధరలోన నెవ్వరేనియు
కరివరదుని దాసు కెగ్గు కల్పించిన వా
రరయగ చెడుదురు, నిక్కము
హరి తన భక్తులను గాతు నవడే మూర్తీ! 67

తన యవతారపు మహిమలు
కొనియాడెడి వారికెల్ల కోరిన వెల్లన్
తనియగ నొసగుచు మోక్షం
బనయము కృపసేయుచుండు నా హరి మూర్తీ! 68

హరిభజన కాము లగుచును
చరియింతురు సంతసమున సకలజనంబుల్
పరగగ భేదము లేకను
సరసత సములగుచు భక్తి సరసను మూర్తీ! 69

వరముల నొసగుచు బ్రోచెడి
నరహరి పదపంకజముల నమ్ముకు భక్తిన్
శరణ శరణ్యుండగు హరి
శరణమునే కోరవలయు చక్కగ మూర్తీ! 70

వరదుండగు నీశ్వరుని స
త్పురుషుడు దేహాభిమాన భోగములకునై
వరమిమ్మని కోరుకొనడు
చిరమగు మోక్షమ్ము కోరి చేరును మూర్తీ! 71

నారాయణుడే జగ దా
ధారుండగు నీశ్వరుండు, తలప నతనికిన్
లే రెందుసములు నధికులు
కారుణ్యోత్తముడు, నిర్వికారుడు మూర్తీ! 72

మనమున చేకొని భక్తుడు
ననురాగము, నద్భుతంబు ననయము పొడమన్
వినయము దోపగ హరి పద
వనజములకు మ్రొక్కు భక్తివశుడై మూర్తీ! 73

భావమునందున భక్త జ
నావళికి సమస్త సంశయంబులు వాపన్
కావను, బ్రోవను తగుగతి
నీవని వినుతించు హరిని నెమ్మది మూర్తీ! 74

పురుషులు ఇహలోకమ్మున
పరువును, పేరును, కులమును బడయగ నెంతో
విరివిగ వెంపర్లాడుచు
హరిపదమును చేర యత్నమాడరు మూర్తీ! 75

వినుతుడు, భగవంతుండును
ననుపమ విజ్ఞాననిధియు ననదగు హరిచే
మును వివరింప బడినదై
యెనసిన గీతార్థతత్త్వ మెరుగుము మూర్తీ 76

ధరణి చరాచర భూతము
లరయగ జనియించి యందె యణగిన భంగిన్
హరి సృష్టించిన విశ్వము
హరియందే లయముపొందు నరయగ మూర్తీ! 77

మతి, ధన, కుల, కర్మ సము
న్నతి మదముననొప్పి, సజ్జనశ్రేణికి సం
తతమును హానియొనర్చు, కు
మతి చేసినపూజ హరికి నచ్చదు మూర్తీ! 78

బలియుర దండించుట, దు
ర్బలజన రక్షణమును హరి బాధ్యత యగుటన్
కలుషాత్ముల యపరాధము
తలచుచు ఖండించు వారి దర్పము మూర్తీ! 79

కన హరి యపరాధుండగు
జను శిక్షించుటది శిక్ష జరుపుట గాదా
తని రక్షించుటయే, యే
లన వానికి ముక్తి లభ్యమగుటను మూర్తీ! 80

సరసోదార సమంచిత
దరహాస విలోకనముల, ధారుణి జనులన్
నిరతము ముద మొందించెడు
పరమాప్తుడు హరియె విశ్వబంధుడు మూర్తీ! 81

అరయ మనుజుడు చతుర్విధ
పురుషార్థంబులను నాత్మ బొందదలచినన్
ధర తత్ప్రాప్తికి కానము
హరిపద యుగళంబు తక్క నన్యము మూర్తీ! 82

కొందరు స్వభావ మందురు,
కొందరు కర్మం బందురు, కొందరు కాలం
బందురు, కొందరు దైవం
బందురు సర్వేశ్వరుని యనంతుని మూర్తీ! 83

హరి, హర, హిరణ్యగర్భ,
స్వరధీశ్వర, వహ్ని, శమన, జలధిపతి, మరు,
న్నరవాహన, శశి, భూ, రవి
సురముఖ్యులు వేరుగాదు చూడగ మూర్తీ! 84

అనుపమ గుణ సంపూర్ణుని
యనఘుని, సుస్థితుని, గతుని, నాసీను, శయా
నుని, భక్తలోక హృద్గతు
నిని, హరిని మదిని కొలువుము నియతిని మూర్తీ! 85

ఉరు భక్తిని హృదయము హరి
పరమై విలసిల్లునంత పర్యంతము స
త్పురుషుల కిహలోకంబున
చిరతర సౌఖ్యాది వితతి చేకురు మూర్తీ! 86

కన నఘ చరిత్రుడు హరి
యనయము భక్తప్రియుడగుచు నమ్మడు వోవున్
మును తన్ను భృగువు తన్నిన
కనలక సంతోషవృత్తి కావడె మూర్తీ! 87

సరి, దంభోనిధి, ఖగ, మృగ,
ధరణీ, సురవర్త్మ, పర్వత ప్రముఖములై
పరగిన విరించి సృష్టులు
హరి యుదరము సొచ్చియుండు ననువుగ మూర్తీ! 88

అనఘుంబగు హరి చరితము
వినిన, పఠించిన లభించు విస్తృత కీర్తుల్
వనజోదరు పదభక్తిని
ననువుగ నిహపర సుఖంబు లందును మూర్తీ! 89

శ్రీవిభునివలన యీ లో
కావళి యుదయించు,పెరుగు,నణగును కన రా
జీవభవాదుల కతడే
జీవము, నిర్మాణహేతుచేతన మూర్తీ! **90**

ఏభక్తి విష్ణుగుణ పర
మై, భవపాప ప్రణాశమై, ముక్తిశ్రీ
లాభంబును చేకూర్చునొ
యాభక్తివిధాన ముందు కరుగుము మూర్తీ! **91**

హరి మానవులకు పూజ్యుడు
హరి లీలామానుషుడు, గుణాతీతుడునై
పరగుచు, భవ కర్మంబుల
బొరయ డెపుడు హరికి కర్మ ముచ్చట మూర్తీ! **92**

విమలమతి వలన నెవ్వని
బొమముడి మాత్రమున నిఖిల భూదేవీ భా
రము వాయు నట్టి హరిపద
కమల మరందమ్ము గ్రోల ఘనుడగు మూర్తీ! **93**

మంద ప్రజ్ఞుడవై గో
విందుని, మురదైత్యహరుని, విష్ణుని, పరమా
నందుని, నంద తనూజుని,
మందరధరు చిత్తమందు మరువకు మూర్తీ! **94**

హరిదౌ పవిత్ర మంగళ
చరితామృత మాత్మ గ్రోల జను డితర కథా
గరళము గ్రోలడు, హరి సం
స్మరణము మానవుల కఖిల సౌఖ్యము మూర్తీ! 95

ఏ నరుడైనను నిముషం
బైన వృధావాదగతిని హరిపద కమల
ధ్యానానందుడు కాడో
యా నరునకు నాయు వల్పమవుగా మూర్తీ! 96

హరి మహిమను తన్నాభీ
సరసిజ సంజాతుడైన చతురాననుడున్
పరికించి యెరుగడన్న, ని
తర జనులకు చెప్పబూన తరమా మూర్తీ! 97

జనన స్థితి విలయంబుల
కనయంబును హేతుభూతమగు మాయా లీ
లను చెంది నటన సలిపెడు
ననఘాత్ముని సేవచేయ నలయకు మూర్తీ! 98

పావనమౌ హరి చరిత క
థా విలసితమైన సు మహిత స్తవము జగ
త్పావనము విగత సంశయ
భావుకతన్ బుద్ధి నిలుపవలయును మూర్తీ! 99

అగుణుండై లీలార్థము
జగముల కల్పించుచుండు చతురుని హరినిన్
సగుణునిగా నుతియించిన
తగ సంతసమందు నతడు తప్పక మూర్తీ! 100

మది నిండిన కోర్కెను హరి
పదకమల మరందపాన పరవశులై పెం
పొదవినవారి చరిత్రము
సదమలమతి వినిన జన్మ సఫలము మూర్తీ! 101

మతి నెంచిన హరికి హితా
హితులును, సన్మాన్యులును, విహీనులు, నతిగ
ర్వితులును లేరీశుడు సమ
మతియును, నిఖిలైక భూతమయుడును మూర్తీ!102

హరిభక్తి లేని జ్ఞానము
హరికి సమర్పింపనట్టి యఖిల కృతంబుల్
హరిభక్తి లేని పలుకులు
కరము నిరర్థకములగును కనుగొన మూర్తీ! 103

కనుగొన సంసారంబను
వనమున సరిదారి కనక వాంఛలచే వే
దన బొందెడు వానికి వి
ష్ణుని గుణకీర్తనము దారి చూపును మూర్తీ! 104

తనవారి చంపజాలక
వెనుకకు పోనిచ్చగించు విజయుని శంకన్
ఘన యోగవిద్య బాపిన
మునివంద్యుని హరిని భక్తి మ్రొక్కుము మూర్తీ! 105

మన సారథి, మన సచివుడు,
మన నెయ్యము, మన సఖుండు, మన బాంధవుడున్,
మన విభుడు, గురువునౌ హరి
మనలను విడనాడబోడు మరువకు మూర్తీ! 106

హరి పాదంబులు తాకిన
సిరికతమున నిఖిల భువన సేవ్యత్వముతో
స్థిరమగు సంపద కలుగును
హరి స్మరణ మానుకున్న నఘమే మూర్తీ! 107

హరి తా నొసగిన కరుణా
పరిలబ్ధ జ్ఞానకలిత భావముతోడన్
పరతత్త్వ వేదివై త
చ్చరణ సరోజముల విడకు శ్రద్ధను మూర్తీ! 108

---హరిః ఓం---

సాహిత్యోత్సవాల నిర్వహణలో అందెవేసిన చెయ్యి

సర్వజనామోదకరమైన, ఆనందదాయకమైన సాహిత్యం విభేదాలకు దూరంగా ఉంటుందని నిశ్చితాభిప్రాయం కలవారు కళాగౌతమి వ్యవస్థాపకులు డా. బి వి యస్ మూర్తిగారు. తెలుగు,కన్నడ భాషలలో నిష్ణాతులైన డా. మూర్తి సంస్కృతం, హిందీ, ఇంగ్లీషు భాషలలో కూడా సమర్థమైన ప్రజ్ఞ కలవారు. బెంగుళూరు విశ్వవిద్యాలయంనుండి తెలుగు-కన్నడ భారతముల పరిశోధనము ద్వారా డాక్టరేటుపట్టా నొందిన డా. మూర్తి శృంగేరీ పీఠాధిపతుల దివ్యాశీస్సులు పొందగలిగారు. వారి దిగ్దర్శకులైన శ్రీ చన్నాప్రగడ తిరుపతిరావుగారు పరిశోధన విషయంలో రాజీపడని వ్యక్తిగ ప్రసిద్ధులు. విషయం తూచిన తూకానికి రాకపోతే నిర్మొహమాటంగ థీసిస్సు త్రిప్పి పంపేయగల సాహసికులాయన. అటువంటి మహానుభావుల మెప్పును పొంది తన థీసిస్సు తులనాత్మక పరిశీలనము చేసేవారికి ఒక ఆదర్శగ్రంథంగ ముద్రణలోనికి తెచ్చుకున్న డా. మూర్తిగారి ప్రతిభ పండితజన రంజకం.

దళితులపై శ్రీమూర్తిగారికి ప్రత్యేకమైన అభిమానం. యన్ యస్ యస్ కార్యక్రమాలలో వారు దళితుల పేటలలో సాంఘిక సేవాకార్యక్రమాలతోపాటు, వారిలో చైతన్యం తీసుకురాడానికి ఎన్నో ఉపన్యాసాలు చేసి వారి మూఢాచారాల్ని, అపనమ్మకాల్ని దూరంచేయడానికి విశేషకృషి చేశారు. ముమ్మిడివరప్పాడు, తూర్పుగోదావరిజిల్లా. గోపాలపురం మండలంలో ఒక చిన్న ఊరు. డా. మూర్తి 1986లో వారిలో తెచ్చిన చైతన్యం వారి మనసుల్లో చెరగని ముద్రగ నిలిచిపోయింది. 1994లో వారు వారి పేటలో రామాలయం నిర్మించుకుని డా. మూర్తిగారే దానికి ప్రేరకులని వారిచేతనే అక్కడ విగ్రహప్రతిష్ఠ చేయించుకోడం డా. మూర్తిగారి సేవాభావానికి, సమసమాజ సౌశీల్యానికి తార్కాణం.

జాతీయ సమైక్యతకోసం, కులభేదాల నిర్మూలనంకోసం తద్వారా హిందూసమాజ పటిష్ఠతకోసం డా. మూర్తిగారు దళితుల ఔన్నత్యాన్ని తెలియజేస్తూ "దళిత కథా మంజరి" గ్రంథాన్ని రచించారు. అది కళాప్రపూర్ణ బోయి భీమన్న, ఆచార్య కొలకలూరి ఇనాక్, పార్లమెంటు సభ్యులు శ్రీ కె యస్ ఆర్ మూర్తి వంటి వారి ప్రశంసలనందుకుంది. డా. మూర్తిగారికి భారతీయతపైగల మక్కువకు మరో ఉదాహరణ వారు రచించిన "భారతీయ సనాతన ధర్మం". డా. మూర్తిగారి విశాలహృదయానికి మరొక మణిదీపిక "ఆరాధన" జైన నీతి కథలు. జైన సాహిత్యాన్నికూడా చక్కగ అవగాహన చేసుకుని దానిపై ఒక గ్రంథం వెలువరించడం సామాన్యవిషయంకాదు. కొంతకాలం రాజమండ్రిలోని జైన బాల,బాలికలకు వారి మతవిద్యను బోధించారు కూడా. డా. మూర్తి సహృదయ చింతామణి, సరస సంభాషణా చతురుడు, సహాయమందించడంలో అగ్ర భాగాన ఉండే వ్యక్తి. సంగీత, సాహిత్య, ఆధ్యాత్మిక కార్యక్రమాలలో వారెప్పుడూ ముందుంటారు. కార్యక్రమాల నిర్వ హణలో వారికొక ప్రత్యేకత ఉంది. వారు జరిపిన దళిత సదస్సు, గిరిజన సదస్సు, జాషువా శతజయంతి, దామెర్ల రామారావు శతజయంతి సాహితీ ప్రియులకు మరుపురానివి. సమయస్ఫూర్తితో, సమయ పాలనతో సభానిర్వహణ జరపడం డా. మూర్తిగారికి కొట్టినపిండి.

నిమ్మలపూడి వీర్రాజు

ఆదర్శ గురువు,సంఘ సేవకులు డా. మూర్తి

కన్నడ కస్తూరిని తేట తెనుగులో రంగరించి, శోధించి, సాధించిన తులనాత్మక ప్రయోగం గౌతమీతీరంలో పరిమళింపచేసిన పండితుడు, తన పరిశోధన కాలతిమిరంలో కొట్టుకుపోకుండా ఎన్నో గ్రంథాలకు ప్రాణప్రతిష్ఠ చేసిన మహనీయుడు, హైందవ సంస్కృతీ, సంప్రదాయాల పరిరక్షణకోసం, సనాతన భారతీయ ధర్మాన్ని ఆంధ్రావళి కందివ్వడానికి అహరహం కృషిచేస్తున్న మాననీయుడు, తన రచనలలో పాండిత్యప్రకర్షకు చోటివ్వకుండా సులభమైన తెలుగు పదబంధాలతో తనదైన శైలిని రుచిచూపిన సహృదయుడు డా. బులుసు వేంకటసత్యనారాయణమూర్తి స్థానిక గౌతమీ విద్యాపీఠంనుండి రీడరుగ పదవీవిరమణచేయడం వారి సాహిత్యసేవకు సంపూర్ణసమయావకాశంగ భావించాలి మనం.

డా. మూర్తి తమ రచనలద్వారా దేశీయులచేతనే కాదు, అమెరికా,ఆస్ట్రేలియా తెలుగు సంఘాల వారి చేతను ప్రశంసించబడ్డారు. సాహిత్యోత్సవాల నిర్వహణలో అందెవేసిన చేయిగ స్వర్గీయ శ్రీ గంధం నాగసుబ్రహ్మణ్యం వీరిని ప్రశంసిస్తూండేవారు. 'ఏషియా పసిఫిక్ హు ఈజ్ హు'లో పేరు నమోదైన ప్రసిద్ధుడు డా.మూర్తి. సర్వజనామోదమైన, ఆనందదాయకమైన సాహిత్యం విభేదాలకు దూరంగ ఉంటుందని నిశ్చితాభిప్రాయంతో తన జీవితాన్ని మలుచుకున్న ఉదాత్తవ్యక్తి డా. మూర్తి.

కోనసీమ నడిబొడ్డున ఇరుసుమండ గ్రామంలో శేషమ్మ, వేంకటరమణయ్యల ద్వితీయ పుత్రుడుగ **24-3-1946**లో జన్మించిన డా. మూర్తి మోడేకుఱ్ఱు సంస్కృత కళాశాలలో భాషాప్రవీణ చదివారు. ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఎం. ఏ చేసి, కన్నడ భాషాపరిచయంతో బెంగుళూరు వెళ్ళి ఆ విశ్వవిద్యాలయంనుండి ఎం. ఫిల్, పిహెచ్. డి డిగ్రీలు పొందారు. తెలుగు,కన్నడ భారతములపై వీరి పరిశోధన సహాచీన విషయ ప్రతిపాదకముగ నున్నదని శ్రీ శృంగేరీ పీఠాధిపతులు ప్రశంసించారు. డా. మూర్తి పరిశోధన ప్రశంసార్హమని ఆచార్య జి. వి. సుబ్రహ్మణ్యం మెచ్చుకున్నారు.

దళితులపై శ్రీమూర్తికి ప్రత్యేకమైన అభిమానం. యన్నెస్నెస్ కార్యక్రమాలలో దళితుల పేటలలో సాంఘిక సేవా కార్యక్రమాల నిర్వహణమే కాక వారిలో చైతన్యం తీసుకురాడానికి 'దళిత కథామంజరి' గ్రంథం వ్రాసేరు. ఆ గ్రంథాన్ని శ్రీ బోయి భీమన్న ప్రశంసిస్తూ "మాలపిల్ల రచయిత ఉన్నవ లక్ష్మీనారాయణ, నిరుద్ధ భారతం రచయిత మంగిపూడి వెంకటశర్మ తరువాత డా. మూర్తే" అన్నారు. ఇది డా. మూర్తి నిబద్ధతకు నిదర్శనం. పరధర్మ నిరసనకు దూరంగ, స్వధర్మ ప్రకాశనం ప్రదర్శించగల ప్రతిభా వైదుష్యాలుగల మనోవిశాలుడు డా.మూర్తి. సమాజానికి పనికిరానిదాన్ని కవిత్వంగ భ్రమింపచేస్తూ దాతల సాయంతో పుస్తకాలు ముద్రిస్తూ సాహిత్య లోకాన్ని కలవరపెట్టే దుష్ట సంప్రాదాయానికి విరుద్ధంగ జనుల కుపయోగపడే సాహిత్యాన్ని స్వంత ద్రవ్యంతో ముద్రించి అందించడం డా. మూర్తి ప్రత్యేకత. దానికి గుర్తింపే ప్రభుత్వ 'ఉత్తమ ఉపాధ్యాయ' పురస్కారం.

శ్రీమధునాపంతుల, శ్రీమల్లంపల్లి, శ్రీప్రసాదరాయ కులపతి, ఆచార్య కొలకలూరి, ఆచార్య జి. వి. యస్, ఆచార్య తంగిరాల, ఆచార్య వేదుల వంటి అనేకమంది ప్రముఖుల ప్రశంసలందుకున్న డా. మూర్తి ధన్యులు.

సంజీవరావు

సాహిత్యంలో విభేదాలు అవాంఛనీయం

సాహిత్యానికి కుల,మత భేదాలు లేవని సర్వజనామోదకరమైన, ఆనందదాయకమైన సాహిత్యం విభేదాలకు దూరంగ ఉంటుందని గౌతమీ విద్యాపీఠం ఉపన్యాసకులు డా. బి.వి.యస్. మూర్తి అన్నారు. 'దళిత సాహితీ సదస్సు'ను డా.మూర్తి నిర్వహిస్తున్న సందర్భంగ ఆయనతో 'న్యూస్ టుడే' కాసేపు ముచ్చటించింది.

సాహిత్యంలో విభేదాలు అవాంఛనీయమనీ, సాహిత్యాభిలాషులందరూ సమాజంలోని సమస్యలను అర్థంచేసుకుని వాటి పరిష్కారానికి కలిసికట్టుగ కృషి చేయాలని ఆయన పేర్కొన్నారు. సమాజంలో ఎవరైతే కష్టనష్టాలకు గురౌతున్నారో అటువంటి వారిని వస్తువుగ తీసుకుని చిత్రీకరింపబడిన కవిత్వం దళితకవిత్వమైతే దానికి ఆరంభం అనాదికాలంలోనే పునాది పడిందని డా. మూర్తి పేర్కొన్నారు. వాల్మీకి తొలిశ్లోకం వేదనాతప్తమైన హృదయంనుండే వెలువడిందనీ, రంతిదేవుడు చేరదీసిన ఛండాలుడుగానీ, వశిష్ఠుని అర్ధాంగి అరుంధతిగానీ దీనికి ఉదాహరణమవుతారని ఆయన చెప్పారు.

సమాజాన్ని ఒకవైపునుండేగాక రెండు కోణాలనుండీ పరిశీలించడం, గత కాలంలో జరిగిన లోపాలను మళ్ళీ మళ్లీ తవ్వుకోడం కంటే భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోడం కవుల,రచయితల తక్షణ కర్తవ్యమని ఆయన వివరించారు. ఈ మార్గంలో మార్క్సిజంకన్న అంబేద్కరిజంను కవులు,రచయితలు అర్థంచేసుకుని అనుసరించాలని డా. మూర్తి పేర్కొన్నారు. మార్క్సిజం ఒక వర్గాన్ని బలపరుస్తూ మరో వర్గాన్ని వ్యతిరేకిస్తుందనీ, అంబేద్కరిజం సర్వవర్గశ్రేయోదాయిని, బహుజనహితదాయిని. వర్గరహితమైన, వ్యక్తినిష్ఠమైన, మానవతా ప్రధానమైన విధానమనీ ఆయన వివరించారు. విశ్వమానవ సమాజ నిర్మాణానికి, వసుధైక కుటుంబాన్ని ఆవిష్కరించడానికి అంబేద్కరిజం మూలాధారమవుతుందని ఆయన తన అభిప్రాయం వ్యక్తంచేసారు.

దళిత సాహిత్యమనేది ఒక ఉద్యమంగ నడవడం కంటే వారి అభివృద్ధి ఒక కర్తవ్యంగ భావించి దానికి మనస్ఫూర్తిగ కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని వారు చెప్పారు. సమాజంలో ఉన్న అన్ని వర్గాలు తరతమ భావాలు మరచి ఏకోన్ముఖంగ కృషిచేస్తే అచిరకాలంలోనే మనదేశం ప్రపంచంలోనే ఉన్నత స్థానానికి చేరుకుంటుందని ఆయన ఆశించారు. దళితుల్లో విద్యాభివృద్ధి చేయడంద్వారా వారి స్థానాన్ని వారికి తెలియజెప్పి దాన్ని సాధించుకోడంద్వారా మన ప్రాచీన సంప్రదాయాన్ని, ప్రసిద్ధిగన్న మన సంస్కృతిని కాపాడుకునేలా చేయడం నేటి కవుల, రచయితల కర్తవ్యమన్నారు.

దళితులు వారి సందేహాలను తీర్చుకోడంద్వారా తాముకూడా ఈదేశ సంస్కృతీ నిర్మాణంలో మూలస్తంభాలమని తెలుసుకోవాలని డా. మూర్తి చెప్పారు. అరుంధతీయుల మూలమైన అరుంధతి అందరకు ఆరాధనీయురాలనీ, మాతంగుల మూలపురుషుడు మతంగుడు గొప్ప మహర్షిగ కీర్తింపబడ్డాడనీ ఆయన పేర్కొన్నారు. సమాజంలోని అగ్రవర్ణాలు తమ వర్ణాభిమానాన్ని నిర్మూలించుకోడంద్వారాను, దళితులు తమలో ఆత్మవిశ్వాసం పెంపొందించుకోడంద్వారాను ఒకరికొకరు చేరువై విశ్వమానవ కల్యాణానికి, దేశాభివృద్ధికి, ప్రగతికి బాటలు వేయాలని డా. మూర్తి ఆశాభావం వ్యక్తపరిచారు.

కావ్య ప్రయోజనం విశ్వశ్రేయం కావాల్సిందే

విద్యార్థులకు పాఠం చెప్పడమే తన ధర్మంగ విరామ సమయంలోకూడా విద్యార్థులతోనే పఠన పాఠనములు జరుపుతూండే ఆదర్శోపాధ్యాయుడు, స్పాన్సరర్ల సాయంతో పుస్తకాలు ముద్రించి సాహితీ లోకాన్ని కలవరపెట్టేసే దుస్సంప్రదాయానికి భిన్నంగ ప్రజోపయోగమైన పుస్తకాలు రాస్తూ స్వంత ఖర్చుతో ముద్రించి జనాంకితం చేస్తున్న సదాచార సంపన్నుడు డా. బి.వి.యస్.మూర్తి రాష్ట్రప్రభుత్వ ఉత్తమ అధ్యాపక పురస్కారం అందుకుంటున్న సందర్భంలో 'సూర్య' ప్రతినిధితో ముచ్చటించారు.

సాహితీరంగాన మీ స్ఫూర్తి, విద్యా, కుటుంబ విషయాలు చెప్పండి?

మాది వైదిక కుటుంబం. మా పెదతండ్రిగారు శతాధికగ్రంథకర్త. మరో పెదతండ్రిగారైతే తన సాహితీ వైదుష్యంతో రాష్ట్రపతి సన్మానం పొందారు. మా తండ్రి గ్రామాధికారిగా ఉన్నా వేదాభ్యాసం చేసినవారు. ఈ ప్రభావం నామీదకూడా ఉండడం సహజమేకదా! 1968లో భాషాప్రవీణ చేసాను. పండిత శిక్షణానంతరం 1972లో ఆంధ్రవిశ్వవిద్యాలయంలో యం.ఏ. చేసాను. అనంతరం జ్ఞానభారతి, బెంగుళూరు విశ్వవిద్యాలయంనుంచి యం.ఫిల్, పిహెచ్.డి చేసాను.

మీ పుస్తకాల గురించి చెప్పండి?

నా యం.ఫిల్, పిహెచ్.డి గ్రంథాలను ముద్రణ చేసాను. కన్నడంలో 8వ శతాబ్దానికి చెందిన శివకోట్యాచార్యుడు వ్రాసిన 'వడ్డారాధనె' జైననీతికథల్ని 'ఆరాధన' పేరుతో తెలుగులోకి అనువదించాను. హైందవమత ధర్మాన్ని సరళమైన శైలిలో 'భారతీయ సనాతన ధర్మం'గ రచించాను. సమకాలీన సమాజంలో మానవునికి ధార్మిక ఉద్బోధచేసే ' హిందూధర్మ సారం' వ్రాశాను. సాహిత్య విద్యార్థుల సౌకర్యంకోసం 'చంద్రాలోకం' 'అప్పకవీయం' లక్షణగ్రంథాలకు వ్యాఖ్యానం వ్రాసి ముద్రింపించాను. నేను కూర్చిన 'భారతసూక్తులు' ప్రాచ్య ప్రవేశ పరీక్షకు పాఠ్యగ్రంథంగ పెట్టారు. అంబేద్కరు సూచనలకు విరుద్ధంగ మతమార్పిడి చేసుకుంటున్న దళితులకు తమ ధర్మాన్ని, కర్తవ్యాన్ని తెలియజేస్తూ 'దళిత కథా మంజరి' వ్రాశాను. తిక్కన భారతంపై 'తిక్కన భారతాలోకనం' వ్యాసాలు ముద్రించాను. లలితా సహస్రనామంపై భాస్కరదీపికా వ్యాఖ్యానం ముద్రించాలి.

మీ పుస్తకాలు సాధించిన విజయాలు చెప్పండి?

ఆంధ్రదేశంలోని సాహితీప్రియులందరికి నేను పరిచయమయ్యాననుకుంటాను. అన్ని గ్రంథాలయాల్లోను నా గ్రంథాలున్నాయి. ఆంధ్రేతర ప్రాంతాలవాళ్ళూ పలకరిస్తున్నారు. ప్రపంచ తెలుగు సంఘాలు, తెలుగు పత్రికలు సుపరిచితమై మామధ్య కరస్పాండింగ్ జరుగుతోంది. ప్రపంచ తెలుగు సమాఖ్య కాన్ఫరెన్సులకు పిలుస్తున్నారు. వ్యాసాలు ముద్రిస్తున్నారు. 'తానా' పత్రికలో నా పుస్తకాలన్నిటి మీద సమీక్షలు ప్రచురితమయ్యాయి. ఆస్ట్రేలియా 'తెలుగు పలుకు' వారూ సంప్రదిస్తున్నారు.

తెలుగు సాహిత్యానికి ఆదరణ ఎలా ఉందంటారు?

ప్రంపంచదేశాల తెలుగువారు కనబరుస్తున్న శ్రద్ధ మనం చూపడంలేదు. కన్నడులుగానీ, తమిళులుగానీ ఇద్దరు కల్సుకుంటే వాళ్ళు వాళ్ళ మాతృభాషలోనే మాట్లాడుకుంటారు. దురదృష్టం మనవాళ్ళుమాత్రం ఇంగ్లీషులో మాట్లాడుకుంటారు. ఈ విధానంలో మార్పుతోబాటు, పాఠ్యప్రణాళికలో కూడా మాతృభాషకు తగిన ప్రాధాన్యత ఇవ్వాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. ప్రభుత్వం మాతృభాషను నిర్లక్ష్యం చేస్తున్నందున సమాజంలో తెలుగు సాహిత్యంపట్ల నిరాసక్తత పెరుగుతోంది.

సగటు తెలుగు విద్యార్థికి తెలుగు సాహిత్యం అందుబాటులో ఉందంటారా?

అసలు విద్యార్థి అందుకోగల్గుతున్నాడా అని ప్రశ్నించుకోవాలి. సాహిత్యాన్ని అర్థంచేసుకుని అనుభూతి పొందే శక్తి విద్యార్థుల్లో క్రమంగ తగ్గుతోంది. సాహిత్యాభిరుచి పాఠకుల్లో ఉంటేనే అద్భుతమైన రచనలు ఆవిష్కారమవుతాయి.

మీ ఆశయం? మీరు సారథ్యం వహించే సాహితీ, సాంస్కృతిక సంస్థల గురించి చెప్పండి?

సాహిత్య ప్రయోజనం విశ్వశ్రేయం కావాలి. స్వార్థాన్ని, వర్గభేదాన్ని రెచ్చగొట్టకూడదు. సాహిత్యాన్ని కుల, మత, వర్గ కూటములుగ విడగొట్టకూడదు. ఇది సాహిత్యానికి ప్రయోజనకారి కాదు. కళాగౌతమి 1992లో నెలకొల్పి సాహిత్య, సాంస్కృతిక సేవలందిస్తున్నాను. మధునాపంతుల ట్రస్టు, శ్రీరామభక్త గానసభ, సీతారామాచార్య కళాపీఠం, కర్ణాటక సాంస్కృతిక సంఘం, సంగీత విద్వత్సభ, త్రివేణీ సాహిత్య సమ్మేళనం మొ. వాటిలో సేవలందిస్తున్నాను.

సూర్య

సన్నిధానం నరసింహశర్మ
ప్రాణహిత కవి

సి. పి. బ్రౌను మందిరం,
20-16-24, సాంబశివరావుపేట,
రాజమండ్రి - 4

మూర్తీభవించిన భక్తిశతకం

తెలుగు సాహిత్యమార్గంలో శతకశాఖ ఒక సుసంపన్న విస్తృతశాఖ. శతకనీతిపద్యాలు విద్యార్థుల పాఠ్యభాగాలలో తగినంతగ లేకపోవడం వర్తమానకాలంలోని ఒక దురదృష్టకర అంశం. శతకపద్యాలలో అందం, చందంకల ఛందం కందపద్యానిది. ఈకాలంలోనూ మనదృష్టికి కొన్ని వచ్చినా, రాకపోయినా భక్తిభావజాలంతో అనేకమంది శతకాలు వ్రాస్తున్నారు. అందుకు, ఇదిగో తాజాసాక్ష్యం ఈశతకం. ఇది నూటెనిమిది రేకులతో విచ్చుకున్న భక్తి బృహత్పుష్పం.

కావ్య,ప్రబంధాలలో నన్నయ,తిక్కనలను అనుసరించి పద్యాలు వ్రాసినవారున్నారు. శతకరచనలో నన్నయ,తిక్కనలను పద్యనిర్మాణంలో అనుసరించడం మూర్తిగారి వైశిష్ట్యం. ఈ శతకకవి శ్రీ బి. వి. యస్. మూర్తిగారు మంచి పండితులు. వీరి ప్రశంసల ఇలాకాలో మధునాపంతుల, శలాక వంటి మహనీయుల చలువదీవెనలు, ససిమెచ్చులూ ఉన్నాయి.

రాజమహేంద్రిలో ఆంధ్రపద్యకవితాసదస్సు స్థానికశాఖవారు ఒకవైపున పద్యప్రబంధ సభలూ అవీ చేస్తున్నారు. పెద్దవారిని అలరించి, ఆనందింపజేసి, ఆలోచింపజేసే తాదాత్మ్యంతో చేస్తున్నారు. కాగా మరోవైపున ఒక్కమూర్తిగారు పద్యరచనలో యువతరానికి తరిఫీదు ఇవ్వాలనే తపనతో పద్యాలు వ్రాయించడం, సంస్కరించడం, ప్రచురించడం చేస్తూ one man armyగ భవిష్యద్దృష్టితో సాహితీసేవ చేస్తున్నారు. అది మూర్తిగారికే చెల్లింది. కళాగౌతమికే చెల్లింది. అది ఆయన దృష్టికి దాఖలా అయితే, ఈభక్తిశతకం ఆయన సృష్టికి, భక్తిభావపుష్టికి దర్పణంగ శ్రీహరిదర్శనంగ నిలచింది.

ఈశతకం చదువుతూంటే భక్తకవి సర్వసమర్పణభావధార భక్తికళాగౌతమి అయి ప్రవహిస్తుంది. ఇది చదువతూవుంటే భారత,భాగవతపద్యాలు, శ్రీకృష్ణశతకపద్యాలూ గుర్తుకు వస్తాయి. ఇలా ఈ అభిప్రాయాన్ని మనం క్రొత్తగ పరిశోధించి చెప్పనవసరం లేదు. కవే మాతృపితృ స్తుతిలో ఓపద్యంలో -

నాదనున దేదియున్నను
నాదాయది? పూర్వకవి ధనమ్మే కాదా?
ఏదో వ్రాసితి నంతియె
నాదని నే చెప్పబోను నమ్ముదు సుజనుల్

అన్నారు. కవి సుజనుడు కనుక, నిజాయితీ ఉన్నవారు కనుకనే ఇలా అనగలిగారు.

ఇంగలమునందు వేసిన
బంగారము వన్నె తగ్గు భంగిని హరి సే
వాంగీకృతుని యఘంబులు
భంగములై పొందు విష్ణుపదమును మూర్తీ!

రెండవపాదం మూడోపాదంతో కలపడంలో ఓఅందం వస్తుంది, వచ్చింది. సంధిచేయడంలో సమాససౌందర్యం వచ్చే సందర్భాలూ ఉంటాయి. ఇటువంటి కొన్ని రహస్యాలు మూర్తిగారికి తెలియడంలో ఆశ్చర్యం లేదు. 39వ పద్యంలో కొందలమనే మాట సహజంగా కలిసింది.

హరిచరణ కమల మకరం
ద రసాస్వాదన మనఃప్రధానుడయిన న
ప్పురుషుం డొకచో విఘ్నం
బొరయ హరిస్మరణ మానకుండును మూర్తీ!

'పకడ్బందీగ' పద్యనిర్మాణం అంటే ఇదిగో ఈ విధంగా ఉంటుంది. వందలో ఇంద అని ఇటువంటి కొన్ని పద్యాలు భారతాది కావ్యకర్తల శైలీ సన్నిహితంగ ఉండడం మకుటధారి అయిన మూర్తిగారికీ, శతకానికీ అద్వైతంగ ప్రకాశకీర్తిదాయకమయింది.

పూర్వకవులు తమ గురించిన యదార్థాలు వారు వ్రాసుకోవడం అనే సంప్రదాయం కలిగినవారు. యథావాక్కుల బీవియస్సయ్య అవడంచేత – మూర్తిగారే –

చదివితి నితిహాసమ్ముల
చదివితి శ్రద్ధను ప్రబంధ సంపదనెల్లన్
చదివిన చదువుకు సార్థక
మొదవగ రచియించినాడ నొప్ప రసజ్ఞుల్

అని యదార్థాన్ని దార్ఢ్యంతో పలికారు.

శ్రీబివియస్ మూర్తిగారు అనేక ప్రాచీన గ్రంథాలకు 'రీడరు'. సాంప్రదాయక భూమికలో భక్తిబీజాల పంటలో మూర్తిశతకం స్థిరీకృత భక్తిభావాలు కొనసాగుతాయి. ఈశతకంలో పురాణ పరీమళాలున్నాయి. భక్తులు భక్తిశతకపద్యాలను కంఠస్థం చేసుకుని తరించే అవకాశముంది. బహువిధ కంద సౌందర్యాలు ఇలా ఉంటాయని సాహిత్యాభిమానులు గ్రహించడానికి అవకాశముంది. సుదీర్ఘసమాస భయస్థులకు అభయంకర రచన యిది. అన్వయ కాఠిన్య భీతులకు అభయహస్తాన్ని చూపే ఉత్తమ భక్తిరచన యిది. తమ సాహిత్య రచనాశక్తికి దర్పణంగ ఈశతకరచన చేసిన మూర్తిగారు ధన్యులు. భక్త సామాజిక సేవ, సాహిత్య సంస్థలద్వారా సామాజికసేవ చేస్తున్న శ్రీ బి. వి. యస్. మూర్తిగారు ప్రయోగశీలిగ ఒక కావ్యం వ్రాయాలని సందర్భశుభాకాంక్షలు పలుకుతున్నాను.